

బీఐఈసీలో ఆరోగ్యరంగంపై ప్రదర్శన

బెంగళూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బెంగళూరు ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్ సెంటర్ (బీఐఈసీ)లో గురువారం అత్యాధునిక ఆవిష్కరణలు చోటు చేసుకున్నాయి. 'ఆక్యుపేషనల్ హెల్త్ - సేఫ్టీ ఎక్సలెన్స్' ఆధ్వర్యంలో సౌత్ ఇండియా 2024 ప్రదర్శన ప్రారంభించారు. తొమ్మిదో ఎడిషన్‌లో భాగంగా డైనమిక్ సదస్సులు, సమ్మేళనాలు, ప్యానెల్ చర్చాగోష్ఠిలను నిర్వహించారు. రెండు రోజుల ప్రదర్శనలో 12 సెషన్స్‌లో 40 సాంకేతిక పత్రాలు సమర్పించనున్నారు. తొలిరోజు 4వేల మందికి పైగా వాణిజ్య ప్రతినిధులు సందర్శించారు. ముఖ్య అతిథిగా కార్మికశాఖ ప్రధాన కార్యదర్శి మహ్మద్ మొహిసిన్ పాల్గొన్నారు.

రాష్ట్ర సమగ్ర అభివృద్ధే లక్ష్యం


సమావేశంలో మాట్లాడుతున్న సీఎం


కేంద్రమంత్రి కుమార స్వామితో సీఎం


సీఎంతో బెంగళూరు గ్రామీణ ఎంపీ డాక్టర్ మంజునాథ్


పాల్గొన్న లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు

- ఎంపీల సమావేశంలో రాజకీయ ఉద్దేశాలు లేవు : సీఎం సిద్దరామయ్య
- ఢిల్లీలో ఆకట్టుకున్న ఆత్మీయ సమావేశం
- సందడి చేసిన అధికార, ప్రతిపక్ష ఎంపీలు

బెంగళూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సంక్షేమమే లక్ష్యంగా ఎంపీలతో సమావేశం నిర్వహించామని, ఇందులో ఎలాంటి రాజకీయ ఉద్దేశాలు లేవని సీఎం సిద్దరామయ్య స్పష్టం చేశారు. ఢిల్లీలోని ఓ హోటల్‌లో గురువారం సాయంత్రం రాష్ట్రం నుంచి ఎన్నికైన లోక్‌సభ, రాజ్యసభ సభ్యులతో ప్రత్యేకంగా ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్, మంత్రులు పరమేశ్వర్, హెచ్‌కే పాటిల్, జార్జ్, ప్రియాంక ఖర్గే, మహదేవప్ప తదితరులు ఇందులో పాల్గొన్నారు. రాష్ట్రం నుంచి లోక్‌సభకు ఎన్నికై కేంద్రమంత్రులైన కుమారస్వామి, ప్రహ్లాద్‌జోషి, శోభాకరంద్లాజె, సోమణ్ణలు పాల్గొన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఒకరినొకరు పరస్పరం విమర్శలు చేసుకున్నా అన్నింటినీ మరిచి అప్యాయంగా పలకరించుకున్నారు. అభిమానంగా మాట్లాడుకున్నారు. సీఎం సిద్దరామయ్య, కేంద్ర మంత్రి కుమారస్వామికి షేక్ హ్యాండ్ ఇచ్చి ప్రత్యేకంగా పలకరించారు. అనంతరం జరిగిన సభలో రాష్ట్రానికి సంబంధించి నేల, నీరు, సంస్కృతి, వనరుల అభివృద్ధి కోసం లోక్‌సభ సభ్యులంతా ఒకే ధ్వనితో ప్రయత్నించాల్సిన అవసరం ఉందని సీఎం పిలుపునిచ్చారు. మేకెదాటు ప్రాజెక్టుకు కేంద్రప్రభుత్వ అనుమతి అవసరమని, భద్ర ఎగువ ప్రాజెక్టుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించినా ఇంకా విడుదల కాలేదన్నారు. కల్యాణ కర్ణాటకలోని రాయచూరులో ఎయిమ్స్ ఏర్పాటుకు వినతిని ఇచ్చామని అదీ పెండింగ్‌లో ఉందన్నారు. మానవ వనరుల అభివృద్ధిలో కల్యాణ కర్ణాటక పూర్తిగా వెనుకబడి ఉందన్నారు. గత ఏడాది నెలకొన్న కరువుకు పరిహారం రూ.18172 కోట్లు కోరామన్నారు. తీరప్రాంత అభివృద్ధికి ఉడాన్ ప్రాజెక్టులో ప్రస్తావనలు విమానాశాఖ వద్ద పెండింగ్‌లో ఉన్నాయన్నారు. బెంగళూరు ఎయిర్‌పోర్ట్‌ను ఎయిర్ కార్గో కాంప్లెక్స్‌గా ప్రతిపాదించిన ప్రస్తావనలు పెండింగ్‌లో ఉన్నాయని, మైసూరు లేదా హాసన్‌లో ఐఐటీ ప్రస్తావన చేశామన్నారు. కస్తూరి రంగన్ నివేదిక పూర్తిగా తిరస్కరించేలా విన్నవించామని అమలు చేసి పశ్చిమకనుమల ప్రాంతాల ప్రజలకు కాస్త ఊరట ఇవ్వాలని కోరారు. రైల్వే ప్రాజెక్టులు పెంచే విషయమై పెండింగ్ ప్రాజెక్టులకు గ్రాంట్లు ఇవ్వాలని రైల్వే మంత్రి సోమణ్ణకు సీఎం విన్నవించారు. గ్రామసడక్ యోజనె ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తక్కువగా ఉందని వెనుకబడి ఉందని నిధులు పెంచాలని కోరారు. 15వ ఫైనాన్స్ కమిషన్‌లో జరిగిన అన్యాయాన్ని 16వ ఫైనాన్స్ కమిషన్‌లో సరిచేసేందుకు కమిషన్ ముందు వాదనలు వినిపించాలని సూచించామన్నారు. కళసా బండూరి ప్రాజెక్టుకు అనుమతులు అవసరమని లేనిపక్షంలో నిర్మాణాలు చేపట్టడం అసాధ్యమన్నారు. 1971 జనాభాను పరిగణిస్తే రాష్ట్రానికి అన్యాయం జరుగుతుందన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ సమగ్రంగా విడుదల చేయించాలని డిమాండ్ చేశారు. వీటన్నింటిపైనా సమష్టి చర్చలకు సౌహార్ద్రసభ ఏర్పాటు చేశామన్నారు. ఈ సభలో రాష్ట్ర అభివృద్ధి మినహా రాజకీయాలు, విమర్శలు లేవన్నారు. కొత్తగా కేంద్రమంత్రులైనవారు రాష్ట్రం పట్ల మరింత అంకితభావం చూపాలని కోరారు. ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి టీబీ జయచంద్ర ఏర్పాట్లను పర్యవేక్షించారు. రాజ్యసభ సభ్యురాలు సుధామూర్తితో సీఎం ప్రత్యేకంగా చర్చలు జరిపారు. లోక్‌సభ ఎన్నికలు ముగిసిన తర్వాత ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా కొత్తగా ఎన్నికైన ఎంపీలతో ఢిల్లీలో ప్రత్యేక సభ జరపలేదు. కర్ణాటక ప్రభుత్వం సమావేశం నిర్వహించడం సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. వివిధ రాష్ట్రాలకు చెందినవారు ఈ అంశంపై ఢిల్లీలో చర్చించినట్టు తెలుస్తోంది.


కేంద్రమంత్రులకు వినతిపత్రం అందజేస్తున్న సీఎం


సీఎంతో రాజ్యసభ సభ్యురాలు సుధామూర్తి కరచాలనం

డీసీఎం..!



- ఉపముఖ్యమంత్రి పదవులపై కొనసాగుతున్న రచ్చ
- మంత్రుల బహిరంగ వ్యాఖ్యలపై సీఎం సీరియస్
- సిద్దూ పదవి వదులుకోవాలి : వక్కలిగ స్వామీజీ
- పదవి కావాలనుకునే వారు అధిష్టానం వద్దకు వెళ్లండి : డీకే శివకుమార్

బెంగళూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజకీయాల్లో ఉత్కంఠ రేపుతోన్న డీసీఎం పదవుల రచ్చ ఆగడం లేదు. గురువారం పలువురి వ్యాఖ్యలతో ఆ మంట మరింతగా రగులుకుంది. లోక్‌సభ ఎన్నికలు ముగిసిన వెంటనే డీసీఎంల విషయం తెరపైకి వచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పటి దాకా డీసీఎం విషయంపై ఒక్క ముక్క కూడా మాట్లాడని ముఖ్యమంత్రి సిద్దరామయ్య దీనిపై తీవ్రంగా స్పందించారు. డీసీఎంలను నియమించేది అధిష్టానం అని, దీనిపై బహిరంగంగా ప్రస్తావించరాదని మంత్రులను హెచ్చరించారు. ఇప్పటి దాకా డీసీఎం పదవి గురించి మాట్లాడినవారిలో మంత్రులు సతీష్‌జార్కిహోళి, రాజణ్ణ, జమీర్‌అహ్మద్ ఉన్నారు. వీరు ముగ్గురూ సిద్దరామయ్యకు అత్యంత ఆప్తులనే విషయం తెలిసిందే. చెన్నగిరి ఎమ్మెల్యే శివగంగ బసవరాజ్ భిన్నమైన వ్యాఖ్యలు చేశారు. డీకే శివకుమార్‌ను ముఖ్యమంత్రిని చేసి అవసరమైతే డజను మందిని డీసీఎంలను చేసుకోవచ్చు అన్నారు.

కెంపేగౌడ జయంతి సందర్భంగా కంఠీరవా స్టేడియంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్‌ల సమక్షంలోనే వక్కలిగ సమాజానికి అనుబంధమైన విశ్వవక్కలిగ మహాసంస్థాన మఠాధిపతి చంద్రశేఖర స్వామీజీ సంచలనమైన వ్యాఖ్యలు చేశారు. డీకే శివకుమార్ కోసం సీఎం పదవిని వదులుకోవాలని ముఖ్యమంత్రి సిద్దరామయ్యను స్వామీజీ కోరారు. అందరికీ అన్ని పదవులు దక్కాయని డీకే శివకుమార్‌కు సీఎం పదవి విడిచిపెట్టాలన్నారు. గతంలో ఐదేళ్లు మీరు సీఎంగా ఉన్నారని రెండోసారి ఏడాది పాలన సాగించారని ఇకనైనా డీకే శివకుమార్‌కు పదవిని వదలాలంటూ సూచించారు. దీంతో సభావేదికపైనే సీఎం సిద్దరామయ్య కాస్త ఇబ్బంది పడ్డారు. స్వామీజీ వ్యాఖ్యల తర్వాత సీఎం, డీసీఎంలు ముభావంగా కనిపించారు.

అధిష్టానం చెంతకెళ్ళి మాట్లాడండి : డీకే శివకుమార్

డీసీఎం పదవి కావాలనుకునేవారు అధిష్టానం చెంతకు వెళ్ళాలని డీసీఎం డీకే శివకుమార్ సూచించారు. గురువారం ఆయన బెంగళూరులో మీడియాతో మాట్లాడారు. అధిష్టానం తీసుకునే నిర్ణయాలు కీలకంగా ఉంటాయని నిత్యం ఏదో వంకతో వ్యాఖ్యానించకుండా అధిష్టానం ముఖ్యనేతలతో చర్చలు జరిపి సాధించుకోవాలన్నారు. కాగా డీసీఎం పదవిపై భిన్నమైన వాదనలు సాగుతున్న తరుణంలో డీకే శివకుమార్ కీలక నిర్ణయం తీసుకుంటారనే ప్రచారం జరుగుతోంది.. తనకు కేటాయించిన పదవిని పలువురు ఆశించడాన్ని ఆయన జీర్ణించుకోలేక పోయారు. మరింత ఒత్తిడి తీసుకువస్తే ఏకంగా డీసీఎం పదవిని వదులుకుంటానని హెచ్చరించదలచినట్లు విశ్వసనీయ సమాచారం. అదే జరిగితే రాష్ట్రంలో రాజకీయం అల్లకల్లోలం కానుంది. డీసీఎం పదవిని వదులుకుంటే నేరుగా ముఖ్యమంత్రి పదవి ఇవ్వాల్సిందేనని పట్టుబట్టే అవకాశం ఉంది. అందుకే రాష్ట్ర పార్టీ నేతలు అనవసరంగా మాట్లాడరాదంటూ సిద్దరామయ్య సూచించినట్లు తెలుస్తోంది.

ప్రియాంకఖర్గేను సీఎం చేయండి..

డీసీఎంల విషయమై చర్చలు సాగుతున్న సందర్భంలోనే మంత్రి ప్రియాంకఖర్గే ఎవరైనా డీసీఎం కావచ్చునని వ్యాఖ్యానించారు. ఇదే విషయాన్ని డీకే శివకుమార్‌తో మీడియా ప్రస్తావించగా ప్రియాంకఖర్గేను ముఖ్యమంత్రిని చేయండి అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.


విధానసౌధలో కెంపేగౌడకు నివాళి అర్పిస్తున్న సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్



ఆదర్శప్రాయుడు.. కెంపేగౌడ

- జయంతి వేడుకల్లో ముఖ్యమంత్రి సిద్దరామయ్య

బెంగళూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఐదుశతాబ్దాల కిందటే బెంగళూరు నగరాన్ని అద్భుతంగా నిర్మించిన కెంపేగౌడ నేటి సమాజానికి ఆదర్శప్రాయుడని సీఎం సిద్దరామయ్య పేర్కొన్నారు. గురువారం కెంపేగౌడ 515వ జయంతి సందర్భంగా కంఠీరవా స్టేడియంలో జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ కెంపేగౌడ సమానత్వ సమాజం కోసం పాటుపడిన దార్శనికుడన్నారు. ఆయన ఏ ఒక్క కులానికో మతానికి పరిమితమైన వారు కాదన్నారు. రైతు కుటుంబంలో జన్మించినా పాలన వ్యవధిలో కులం, మతం అనే విభజన లేకుండా వ్యవహరించారన్నారు. శ్రీకృష్ణదేవరాయల కాలంలో కెంపేగౌడ బెంగళూరు ప్రాంత పాలనాధికారిగా వ్యవహరించారన్నారు. సమాజంలో అన్ని కులాలకు ఆర్థికశక్తిని నింపారన్నారు. బెంగళూరు ఇంతగా అభివృద్ధి చెందేందుకు కెంపేగౌడ కారకులన్నారు. ఆయన దూరదృష్టితో నేడు నగరం శోభాయామానంగా దర్శనమిస్తోందన్నారు. కెంపేగౌడ జీవనం సాగించిన ప్రాంతాలు అభివృద్ధి కావాలని స్వామీజీ సూచించిన మేరకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి అభివృద్ధి చేస్తున్నామన్నారు. బెంగళూరు విశ్వవిఖ్యాత బ్రాండ్ కావాలన్నారు. అనంతరం కెంపేగౌడ పురస్కార గ్రహీతలను సత్కరించారు.

ముందుచూపుతోనే బెంగళూరు అభివృద్ధి : డీకే శివకుమార్

బెంగళూరు నగరాన్ని నిర్మించే ఆలోచనలో కెంపేగౌడ ముందుచూపుతో కార్యచరణ చేశారని అందుకే అభివృద్ధి సాధ్యమైందన్నారు. నాలుగువైపులా కోటలు, చెరువులు నిర్మాణం వంటివి చారిత్రాత్మకమన్నారు. 500 ఏళ్ళకిందటనే దూరదృష్టి చూపారన్నారు. నగరంలో ఒకప్పుడు నదులు లేకున్నా నదులను ఏర్పాటు చేశారన్నారు. చెరువులు, ఆలయాలు ఆయన కాలంలో ఏర్పడినవే అన్నారు. ప్రస్తుతం కార్పొరేషన్ నుంచి మైసూరు రోడ్ వైపునుంచి మెజిస్టిక్ దాకా ఉండే ఎన్నోపేటలు ఆయన ఆలోచన నుంచి వచ్చినవే అన్నారు. శతాబ్దాల ముందే ఆయన ప్రపంచాన్ని చదివారన్నారు. ఆయనను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఆదిచుంచనగిరి మఠాధిపతి నిర్మలానందనాథస్వామీజీ, విశ్వవక్కలిగ మహాసంస్థాన చంద్రశేఖర స్వామీజీ, గురుగుండ బ్రహ్మేశ్వర స్వామి మహాసంస్థాన మఠాధిపతి నంజావధూత స్వామీజీ, మంత్రులు శివరాజ్ తంగడగి, మునియప్ప, కృష్ణబైరేగౌడ, ఎమ్మెల్యే రిజ్వాన్‌అర్షద్, విశ్వనాథ్‌తో పాటు పరిషత్ సభ్యులు పుట్టణ్ణ, రామోజీగౌడ, సలీంఅహ్మద్, గోవిందరాజు వక్కలిగుల సంఘం అధ్యక్షులు హనుమంతయ్యతో పాటు సంఘం పదాధికారులు పాల్గొన్నారు.


పూర్తిగా నిండిన గాజనూరు జలాశయం

నిండుకుండలా గాజనూరు జలాశయం

- రాష్ట్రంలో నిండిన తొలి జలాశయం
- మలెనాడులో భారీవర్షాలు

బెంగళూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మలెనాడు ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలకు శివమొగ్గ జిల్లా పరిధిలోని గాజనూరు తుంగా జలాశయం గురువారానికి పూర్తిగా నిండింది. గురువారం రెండు క్రస్టుగేట్ల ద్వారా నీటిని వదిలారు. దీంతో రాష్ట్రంలో ఈ ఏడాది నిండిన తొలి జలాశయంగా అధికారులు పేర్కొంటున్నారు. 3.24 టీఎంసీల నీటి సామర్థ్యం కలిగిన తుంగా జలాశయం గరిష్ఠ నీటిమట్టం 588.24 మీటర్లు కాగా.. గురువారం ఉదయానికి పూర్తిగా నిండింది. జలాశయానికి ఇన్‌ఫ్లో 6,766 క్యూసెక్కులు కాగా రెండు క్రస్టుగేట్ల ద్వారా 5,285 క్యూసెక్కుల నీటిని వదిలినట్లు తుంగా జలాశయ ఇంజనీర్ తిప్పానాయక్ తెలిపారు.


రేపు ప్రధాని మోదీతో సీఎం సిద్దరామయ్య భేటీ

- ఢిల్లీకి తరలిన కీలక నేతలు
- మూడురోజులు హస్తినలోనే..



బెంగళూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం నుంచి లోక్‌సభ సభ్యులుగా ఎన్నికైన వారితో స్నేహపూర్వక విందుకు ఆహ్వానించిన సీఎం సిద్దరామయ్య ఢిల్లీ బయలుదేరారు. మూడురోజుల పాటు హస్తినలో గడిపే ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఈనెల 29న ప్రధానమంత్రి నరేంద్రమోదీను భేటీ కానున్నారు. ప్రధానితో సీఎం అపాయింట్‌మెంట్ ఖరారైంది. ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రం నుంచి 17మంది బీజేపీ, ఇద్దరు జేడీఎస్ పార్టీనుంచి విజయం సాధించగా 9మంది కాంగ్రెస్ నుంచి విజయం సాధించిన విషయం తెలిసిందే. కొత్తగా లోక్‌సభకు ఎన్నికైన వారికి రాష్ట్ర ప్రభుత్వం తరుపున ప్రత్యేక విందు ఇవ్వాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. ఇందుకు తగ్గట్టుగానే ఎంపీలందరికీ ఆహ్వాన పత్రికలు పంపారు. కేంద్ర కేబినెట్‌లో రాష్ట్రానికి చెందిన ఎంపీలలో కుమారస్వామి, ప్రహ్లాద్‌జోషి, శోభాకరంద్లాజె, సోమణ్ణలు మంత్రులుగా ఉన్నారు. ఇక రాష్ట్ర కోటాలో రాజ్యసభ సభ్యురాలు నిర్మలాసీతారామన్ కేంద్రంలోని కీలకమైన ఆర్థికమంత్రిగా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. కేంద్రం నుంచి రాష్ట్రానికి దక్కాల్సిన గ్రాంట్‌లతో పాటు పెండింగ్ బిల్లులు తదితర పనులు అమలు చేసేందుకు సహకరించాలని సీఎం సిద్దరామయ్య.. ఎంపీలను కోరనున్నారు. సాధారణంగా ప్రభుత్వం ఏదైనా ఎన్నికలు జరిగినప్పుడు కొత్త ఎంపీలకు విందు ఇచ్చే సంప్రదాయం గతంలోను కొనసాగించారు. సీఎంతో పాటు డీసీఎం డీకే శివకుమార్, పలువురు మంత్రులు ఢిల్లీ వెళ్లారు. సీఎంతో పాటు మంత్రులందరూ కర్ణాటక భవన్‌లో బసచేయనున్నారు. కేంద్రమంత్రులు నితిన్‌గడ్కరీ, నిర్మలాసీతారామన్, అమిత్‌షా, రాజ్‌నాథ్‌సింగ్‌సహా పలువురితో సీఎం కలవనున్నారు. ఇలా మూడురోజుల పర్యటకు ముఖ్యులంతా తరలివెళ్ళారు.


ఏపీ సీఎం చంద్రబాబు నాయుడును గురువారం బెంగళూరు ఎయిర్‌పోర్ట్‌లో స్వాగతిస్తున్న కర్ణాటక అంతర్గత భద్రత అడిషనల్ డీజీపీ చంద్రశేఖర్



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,581.25	1,578.79
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	582	556
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	751	2,183
సామర్థ్యం (టీఎంసీలు)	5.11	3.91

వృక్షవిలాపం!



- రాజ్‌కుమార్ రోడ్డులో.... నేలకొరిగిన ఏళ్ళనాటి వృక్షాలు
- వాటిని రీప్లాంట్ చేద్దామన్న ఆలోచనే లేని అధికారులు

చెట్టును పెంచాలంటే కనీసం ఐదు సంవత్సరాలపాటు శ్రమించాల్సి ఉంటుంది. కాని దాన్ని కూల్చాలంటే కొద్ది నిమిషాలు సరిపోతుంది. ప్రస్తుతం అభివృద్ధి పేరుతో చెట్లను ఇష్టారాజ్యంగా కూల్చడం అధికారులకు అలవాటైపోయింది. వాటిని వదిలిపెట్టి పక్కగా రోడ్డు వేయవచ్చు. లేకుంటే వాటిని జాగ్రత్తగా తీసి మరోచోట రోడ్ల పక్కన నాటవచ్చు. అవేమీ లేకుండా గురువారం బళ్లారి రాజ్‌కుమార్ రోడ్డులో చెట్లను కూల్చిపడేశారు. మరి ఐఎఫ్‌ఎస్ డిగ్రీ ఎందుకని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

బళ్లారి గాంధీనగర్, జూన్ 27: రాజ్‌కుమార్ (అనంతపురం రోడ్డు) వెడల్పు కార్యక్రమంలో భాగంగా గురువారం ప్రజా పనుల శాఖ అధికారులు, అటవీశాఖ అధికారులు ఎన్నో ఏళ్ళనాటి భారీ వృక్షాలను పదుల సంఖ్యలో నేల కూల్చారు. రోడ్డు అభివృద్ధి పనుల్లో భాగంగా రోడ్ల ప్రక్కన ఉన్న చెట్లను తొలగించడం సర్వసాధారణమే. అయితే ప్రస్తుతం అధునాతన యంత్రాల ద్వారా అవసరమైన చెట్లను వేర్లతోపాటు తొలగించి ఇతర ప్రాంతాల్లో నాటి వాటికి తిరిగి ప్రాణం పోస్తున్న టెక్నాలజీ మనకు అందుబాటులోకి వచ్చింది. కాని ప్రస్తుతం రాజ్‌కుమార్ రోడ్డులో తొలగించిన ఏళ్ళనాటి వృక్షాలను రీ ప్లాంటేషన్ చేయడం ఎందుకనుకున్నారు కాబోలు... గురువారం ఉదయం అటవీ అధికారులు కొన్ని గంటల్లోనే వాటిని నేలకూల్చి పడేశారు.

ఈ విషయంపై ప్రజా పనుల శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీయర్ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, ప్రస్తుతం రాజ్‌కుమార్ రోడ్డును ఖనిజ నిధులు వెచ్చించి వెడల్పు చేస్తున్నట్లు తెలిపారు. రాయల్ సర్కిల్‌లో ప్రజా పనుల శాఖ ఆధ్వర్యంలో నిర్మాణమవుతున్న బృహత్ టవర్ క్లాక్ నిర్మాణం పనులు పూర్తవుతున్న నేపథ్యంలో రోడ్డు వెడల్పు పనులు జోరుగా సాగుతున్నాయన్నారు. అటవీశాఖ అధికారుల సమక్షంలోనే గురువారం చెట్లను తొలగించామని, అందుకు అవసరమయ్యే రూ 3లక్షల రూపాయలను ఇప్పటికే అటవీశాఖకు చెల్లించినట్లు తెలిపారు.

చెరువులో మొసలి ఉంది జాగ్రత్త!



చెరువులో మొసళ్ళు వున్నాయంటూ ఏర్పాటు చేసిన బోర్డు

కంప్లి, జూన్ 27 : కంప్లి నడిబొడ్డున వుండే సోమప్ప చెరువులో రెండు మొసళ్లు ప్రత్యక్ష మయ్యాయి. గత రెండు మూడు రోజులుగా మొసళ్లు గట్టుకు వచ్చి అక్కడి వారికి కనిపించడంతో వారు భయభ్రాంతులయ్యారు. వారు పురసభ ముఖ్య అధికారికి సమాచారం అందించగా వారు వెంటనే అటవీశాఖ అధికారులకు తెలిపారు. గత రెండు రోజులుగా ఆ మొసళ్లను పట్టుకోవాలని వున్నారు. ఉదయం పూట, సాయంత్రం వేళల్లో వాకింగ్ చేపట్టే వారు అప్రమత్తంగా వుండాలన్నారు. త్వరలోనే చెరువులో వున్న ఆ రెండు మొసళ్లను పట్టి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూస్తామన్నారు. ఇప్పటికే పలు చోట్ల ఫ్లెక్సీలు కూడా ఏర్పాటు చేశామన్నారు.

నన్ను ఉపయోగించుకుని చివరకు ఇలా పడేస్తారా...?



ఫుట్‌పాత్‌పై పడేసిన పోస్టుబాక్స్

నా పేరు పోస్టుబాక్స్. నన్ను కొన్నేళ్ల క్రితం అనంతపురం రోడ్డులో ఉన్న పాతమున్సిపల్ కళాశాల ముందు ప్రజల సౌకర్యార్థం తపాలా శాఖ అధికారులు ఏర్పాటుచేశారు. నగర ప్రజలకు రోజుకు రెండు సార్లు తపాలా సేవలు అందజేయాలని ఇక్కడ ఉండే ఓ చల్లని చెట్టుకు వేలాడదీశారు. కొన్నేళ్ల నుండి ప్రక్కనే ఉన్న కళాశాల విద్యార్థులు, అనంతపురం రోడ్డుగుండా వెళ్ళే ప్రజలు నాలో వేసిన ఉత్తరాలను జాగ్రత్తగా దాచుకుని క్లియరెన్స్ అబ్బాయికి రోజుకు రెండు సార్లు అందజేస్తూ వస్తున్నాను. ఎండకు ఎండి, వానకు తడుస్తూనే ఏళ్ళతరబడి సేవలు అందించిన నాకు అధికారులు రంగులు వేయకపోవడంతో ఈ మధ్య కాలంలో నన్ను ఎవరూ పట్టించుకోవడం లేదు.. మొబైల్ మహమ్మారి వచ్చాక ప్రజలు నన్ను, నా సేవలను పూర్తిగా మరిచి పోయారు. గురువారం అనంతపురం రోడ్డు వెడల్పు చేసే కార్యక్రమంలో భాగంగా అటవీశాఖ అధికారులు నన్ను ఏమాత్రం గుర్తించకుండా ఏకంగా ఫుట్‌పాత్‌పై పడేసి వెళ్ళిపోయారు. నడవడానికి కాళ్ళు లేవు.. మాట్లాడడానికి నోరు ఉన్నా... నోటికి తాళం వేశారు. సహాయం కోరడానికి చేతులు ఉన్నా... రెండుచేతులను కలిపి చెట్టుకు వేలాడదీశారు... అయ్యా.. బళ్ళారి ప్రజలారా!. ఇదేనా మీరునాకిచ్చే మర్యాద? తపాలా శాఖకు ఇచ్చే గౌరవం. అవసరం లేకపోతే నన్ను తీసుకెళ్ళి హెడ్‌పోస్టాఫీసులో ఉండే అధికారులకు అందజేయాలిగాని ఇలా రోడ్డులో పడేయడమేంటి?!

...ఇట్లు మీ పోస్టుబాక్స్, బళ్ళారి గాంధీనగర్

గంజాయి స్వాధీనం.. నిందితుల అరెస్ట్



స్వాధీనం చేసుకున్న గంజాయి మూటలు

బళ్లారి సిటీ, జూన్ 27: నగరంలోని వాల్మీకి వీధిలోని ఓ ఇంట్లో అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ రంజిత్ కుమార్ బండారు తెలిపారు. నగరంలోని జిల్లా పోలీసు సూపరింటెండెంట్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలోని రాణితోట బీరప్ప గుడి సమీపంలో నివాసం ఉంటున్న వహీద్, రూపనగుడి రోడ్డులోని మారెమ్మ గుడి ఎదురుగా నివాసం ఉంటున్న చాంద్‌భాషా అనే వారిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.19కిలోల 100గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సైబర్ పోలీస్ స్టేషన్ డీఎస్పీ సంతోష్ చౌబాన్ సమాచారంతో పోలీస్ ఇన్‌స్పెక్టర్ రమాకాంత, పీఎస్‌ఐ వలీబాషా, బృందం ఈ ఆపరేషన్‌ను నిర్వహించిందన్నారు. ఇప్పటికి జిల్లాలో గంజాయి కేసులకు సంబంధించి 18మంది నిందితులను అరెస్టు చేశామని, 13కేసులు నమోదుచేశామన్నారు. ఇప్పటి వరకు మొత్తం 75కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

స్థాయి సమితి అధ్యక్షులు పద్మరోజకు సన్మానం



పద్మరోజ వివేక్‌ను సన్మానిస్తున్న విష్ణువర్ధన్

బళ్లారి రూరల్, జూన్ 27 : బళ్లారి మహానగరపాలిక ఆరోగ్యశిక్షణ, సామాజిక న్యాయ స్థాయి సమితి అధ్యక్షులుగా పద్మరోజ వివేక్ ఎన్నికయ్యారు. దీంతో బళ్లారి నగర కాంగ్రెస్ సమితి అధ్యక్షులు బోయపాటి విష్ణువర్ధన్ వారిని ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. స్థాయి సమితి అధ్యక్షులుగా ఎన్నిక కావడంతో వారికి అభినందనలు తెలిపారు.

కెంపేగౌడ అసామాన్య పాలకుడు

నివాళులర్పించిన మేయర్ నందీశ్



కెంపేగౌడ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మేయర్ నందీశ్ తదితరులు

బళ్లారి సిటీ,జూన్ 27: నవ బెంగళూరు నిర్మాత అసమాన పరిపాలకుడైన నాడప్రభు కెంపేగౌడ సామాన్య ప్రజల సంక్షేమ కోసం ఎనలేని కృషి చేశారని బళ్లారి మహానగర కార్పొరేషన్ మేయర్ ముల్లంగి నందీశ్ అన్నారు. నగరంలోని డా.రాజ్‌కుమార్ రోడ్డులోని కల్చరల్ కాంప్లెక్స్ ఆవరణలో కన్నడ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన నాడప్రభు కెంపెగౌడ జయంతి కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. నాడదొర కెంపెగౌడ 52ఏళ్ళు పరిపాలించి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. బెంగళూరు సమగ్ర అభివృద్ధికి నాంది పలికిన కెంపేగౌడ దార్శనికత మరు వరానిదన్నారు. ముండరగి నాగరాజ్ పాల్గొని మాట్లాడుతూ వేల సరస్సుల నిర్మాత నాడప్రభు కెంపెగౌడ అని కొనియాడారు. న్యూ బెంగళూరు నిర్మాణంలో ఆయన పాత్ర ఎంతో కీలకమన్నారు. బళ్లారి తాలూకా న్యూ ఎర్రగుడి ఉపాధ్యాయుడు నందీశ్ మాట్లాడుతూ కెంపెగౌడ ఆత్మస్థైర్యంతో నూతన బెంగళూరు మహానగరాన్ని సృష్టించారని ఆయన నడిచిన తీరు ఆయన పాలనను ఈరోజు స్మరించుకోవాలన్నారు. కోట, పట్టణం ఉద్యానవనం మార్కెట్, సరస్సుల వంటి ప్రాజెక్టుల అభివృద్ధి ప్రణాళికలు అప్పట్లోనే రూపొందించారన్నారు. ఆయన ప్రణాళికలే ఆయన దూరదృష్టికి నిదర్శనమన్నారు. కెంపెగౌడకు విజయనగర సామ్రాజ్యానికి అవినాభావ సంబంధం ఉందని, ప్రపంచ ప్రఖ్యాత గాంచిన విజయనగర సామ్రాజ్య మనుగడ కోసం పోరాడిన మహాయోధుడన్న కీర్తి ఆయనకు దక్కిందన్నారు. కార్యక్రమానికి ముందుగా నాడప్రభు కెంపేగౌడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బళ్లారికి చెందిన కవిత గుంగురు సంగీతం వినిపించారు.



కేంపేగౌడ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

సిరుగుప్పలో ఘనంగా కేంపేగౌడ జయంతి

సిరుగుప్ప, జూన్ 27 : సుందరంగా బెంగళూరు నగర నిర్మాణంలో కెంపేగౌడ కృషి ఎంతో వుందని తహసీల్దార్ విశ్వనాథ్ అభిప్రాయం వ్యక్తం చేశారు. సిరుగుప్ప పట్టణంలో తహసీల్దార్ కార్యాలయంలో కెంపెగౌడ 515వ జయంతి వేడుకలు జరిగాయి. ఆయన భావ చిత్రపటానికి పూలమాలలు వేసి అనంతరం నివాళులర్పించారు. బెంగళూరు నేటికీ ఎంతో సుందరంగా వుందంటే దానికి కారణం కెంపేగౌడ కృషేనన్నారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్ గాదెలింగప్ప, సిద్దార్థ, ఆర్‌ఐ మంజునాథ, సిబ్బంది, సమాజ సేవకులు అబ్దుల్ నబీ తదితరులు పాల్గొన్నారు.

కాచిన నీటితో వాంతులు, విరేచనాల నివారణ

- డీహెచ్‌ఓ డా. రమేశ్‌బాబు వెల్లడి



గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

బళ్లారి సిటీ, జూన్ 27: కలుషితనీరు తీసుకోవడం వల్ల వాంతులతోపాటు అంటువ్యాధులు ప్రబలే అవకాశాలున్నాయని, కనుక కాచిన నీటిని తీసుకోవాలని డీహెచ్‌ఓ రమేశ్‌బాబు తెలిపారు. ఆయన మాట్లాడుతూ గురువారం బళ్లారి తాలూకా వైకగ్గల్ గ్రామాన్ని సందర్శించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఓఆర్‌ఎస్ తయారు చేస్తున్నప్పుడు ఆ శాఖ ఇచ్చిన ఓఆర్‌ఎస్ ప్యాకెట్ పొడిని పూర్తిగా లీటరు నీటిలో కలిపి ఆ మిశ్రమాన్ని వాంతులు చేసుకునే రోగులకు తాగేందుకు అందించాలన్నారు. కలుషిత నీటి వినియోగం వల్ల సాధారణంగా విరేచనాలు, కలరా టైఫాయిడ్, హెపటైటీస్, వంటి వ్యాధులు వ్యాపిస్తాయని ఆయన తెలిపారు. ప్రస్తుతం గ్రామంలో వ్యాధి పూర్తిగా అదుపులో ఉందని, జిల్లా కలెక్టర్, జిల్లాపంచాయితీ సీఈఓ ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రభుత్వ సీనియర్ ప్రాథమిక పాఠశాలలో తాత్కాలిక చికిత్సా కేంద్రాన్ని ప్రారంభించి, తాలూకా హెల్త్ ఆఫీసర్ల ఆధ్వర్యంలో వైద్య బృందం 24గంటలు అక్కడే ఉండి తగిన వైద్యం అందిస్తోందన్నారు. భోజనానికి ముందు మరుగుదొడ్డి ఉపయోగించిన తర్వాత చేతులు సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలని చెప్పారు. ఈసందర్భంగా డా.మరియంబి, తాలూకా ఆరోగ్యఅధికారి డా.అబ్దుల్లా, ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు కావ్య తదితరులు పాల్గొన్నారు.

25వ వార్డులో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి

బళ్లారి సిటీ,జూన్ 27: నగరంలోని 25వ వార్డులో గత మూడు సంవత్సరాల నుండి డ్రైనేజి, తాగునీటి సమస్యలజూజీ ప్రజలు సమస్యలను ఎదుర్కొంటున్నారని వార్డు సమస్యలను పరిష్కరించాలని వార్డు కార్పొరేటర్ గోవిందరాజులు కమిషనర్‌కు వినతి పత్రం అందించారు.



కమిషనర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న గోవిందరాజులు

పరిసరాల శుభ్రతపై మించు శ్రీనివాస్ చర్యలు

బళ్లారిరూరల్, జూన్ 27 : బళ్లారి 35వ వార్డులోని ప్రభుత్వపాఠశాల ఆవరణతో పాటు ఇందిరానగర్, అంబేద్కర్ పాఠశాల ఆవరణలో ఆరు నెలలుగా కేఎంఎఫ్ నుంచి వృథాగా ప్రవహిస్తున్న నీరు నిల్వవుండటంతో పాటు పొరుగువారు చెత్తాచెదారాన్ని అక్కడే వేస్తున్నారు. దీనిపై స్పందించిన కార్పొరేటర్ మించు శ్రీనివాస్ దానిపై చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలిపారు. ఈ విషయాన్ని కమీషనర్ దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరలో శుభ్రం చేయించాలని కోరారు.



పాఠశాల ప్రాంతాన్ని శుభ్రం చేయిస్తున్న శ్రీనివాస్

బోనులో పడ్డ ఎలుగుబంటి



బుక్కసాగర వడ్డమ్మగుడి వద్ద బోనులో చిక్కుకున్న ఎలుగుబంటి

కంప్లి, జూన్ 27 : విజయనగర జిల్లా బుక్కసాగర వడ్డమ్మ దేవస్థానం వద్ద వుంచిన బోనులో ఎట్టకేలకు ఎలుగుబంటి చిక్కింది. ఇటీవల కడేబాగిలి వైపు వడ్డమ్మ దేవస్థానం వద్ద రామాంజినేయులు, రాజేశ్వరి అనే రైతులు పొలంలో పనులు ముగించుకుని ఇంటికి వస్తుండగా అక్కడే దాక్కున్న ఎలుగుబంటి ఒక్కసారిగా దాడి చేసింది. చుట్టుపక్కల వారు ఒక్కసారిగా కేకలు వేయడంతో అది కొండ వైపు పరుగులు తీసింది. ఈ విషయాన్ని గ్రామపెద్దలకు తెలుపగా వెంటనే వారు అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. గురువారం ఉదయం అక్కడకు రాఘవేంద్ర, నాగరాజు సిబ్బంది చేరుకుని బోను ఏర్పాటు చేశారు. ఎట్టకేలకు రాత్రి ఎలుగుబంటి బోనులో పడింది. దీంతో రైతన్నలు హర్షం వ్యక్తం చేశారు.

లారీని ఢీకొన్న టెంపో ట్రావెలర్.. ఒకరి మృతి



నుజ్జునుజ్జయిన టెంపో ట్రావెలర్

బళ్లారి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): విజయనగర జిల్లా ఆలూరు క్రాస్ వద్ద గురువారం తెల్లవారు జామున 50వ జాతీయ రహదారిపై చెడిపోయి ఆగిన లారీని వెనుక నుండి టెంపో ట్రావెలర్ ఢీకొంది. దీంతో టెంపో ట్రావెలర్‌లో ప్రయాణిస్తున్న ఒక వృద్ధుడు మరణించగా 15 మంది గాయపడ్డారు. కలబురగి నుంచి ఆరోడి గ్రామానికి పెళ్లి నిశ్చితార్థం కోసం మొత్తం 17 మంది వెళ్లారు. బుధవారం రాత్రి నిశ్చితార్థం ముగించుకుని వచ్చిన వాహనంలోనే తిరుగు ప్రయాణమయ్యారు. ఆలూరు క్రాస్ వద్ద గంగావతి నుండి మైసూర్‌కు వెళుతూ ఓ లారీ చెడిపోయి రోడ్డు పక్కన ఆగి వుండగా, టెంపో ట్రావెలర్ డ్రైవర్ వెనుకనుంచి దాన్ని ఢీకొట్టాడు. దీంతో అందులో ప్రయాణిస్తున్న రామకృష్ణయ్య(68) అక్కడికక్కడే మరణించాడు. లక్ష్మి నరసప్ప, శారదమ్మ, సుందర్, గాయత్రమ్మ, మంజుల, నరసింహరాజు, జయరామిరెడ్డి, నాగరాజు, మరియమ్మ తీవ్రగాయాల పాలయ్యారు. గాయపడిన వారిని విజయనగర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసునమోదు చేసుకుని విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అంగన్‌వాడీ భవన నిర్మాణానికి భూమి పూజ

బళ్లారి సిటీ,జూన్ 27: పదో వార్డు పెద్దమార్కెట్ దగ్గర రూ.21.50లక్ష రుపాయల వ్యయంతో నిర్మాణమవుతున్న అంగన్ వాడీ భవన నిర్మాణానికి విధానపరిషత్ సభ్యులు వై.ఎం.సతీశ్ గురువారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజి ఎమ్మెల్యే సోమశేఖర్‌రెడ్డి, పాలికె సభ్యులు కోనంకి తిలక్, గోవిందరాజులు, శ్రీనివాస్‌మోత్కార్, గోవింద, వేమణ్ణ, తదితర అధికారులు, బీజేపీ ప్రముఖులు పాల్గొన్నారు.

శ్రీచైతన్య విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న జిల్లాకలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా

వైద్యప్రవేశ పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన శ్రీచైతన్య విద్యార్థులను జిల్లాకలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా అభినందించారు. విద్యార్థులైన మోహమ్మద్ ఫైజాన్, మనోజ్, అభినవ్, పాణ్యం శ్రీదత్త, కార్తీక్, సుదీప్ పాటిల్, శంభులింగయ్య ,సూర్యకిరణ్, సంతోష్‌కుమార్, జ్యోతి, ప్రియాన్షిక, కీర్తన తదితరులను జిల్లాకలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా అభినందించారు. సాధన చేసిన విద్యార్థులను వీరి కోసం కృషి చేసిన పాలక మండలిని, కాలేజీ సిబ్బందిని, పోషకులను అభినందించారు.

హోసూరు జోన్

మృతి చెందిన కుటుంబాలను ఆదుకోవాలి



మృతి చెందిన కుటుంబాలకు అండగా నిలిచి నిరసన తెలుపుతున్న దృశ్యం

హోసూరు జూన్ 27 : హోసూరు ప్రాంతంలోని మత్తిగిరి కూసనీ పాళ్యలో పురాతన మర్రి చెట్టు లారీపై పడిపోవడంతో మరణించిన వారి కుటుంబస్థులకు ప్రభుత్వ ఉద్యోగం, రూ.10 లక్షలు అందిచాలని అంబేద్కర్ స్వచ్ఛంద సంఘం అన్నానగర్ హోసూరు అధ్యక్షుడు సంతోష్ కుమార్ డిమాండ్ చేస్తూ రెవిన్యూ శాఖకు వినతిపత్రం అందజేశారు. దీనిపై సమాచారం అందుకున్న హోసూరు డీఎస్పీ బాబు ప్రశాంత్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

స్టాలిన్‌కు కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే

హోసూరు జూన్ 27: హోసూరులో రెండు వేల ఎకరాల్లో అంతర్జాతీయ విమానాశ్రయాన్ని నిర్మించనున్నట్లు తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కే.స్టాలిన్ శాసనసభలో ప్రకటించడమే కాకుండా 110 సెక్షన్ క్రింద నోటిఫికేషన్ జారీ చేయడాన్ని హోసూరు పరిశ్రమ రంగం, చాంబర్ ఆఫ్ కామర్స్, హోసూరుఎమ్మెల్యే, మేయర్, స్వాగతించారు. హోసూరులో అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటు చేస్తానని ముఖ్యమంత్రి తెలుపడంతో హోసూరు జిల్లా కార్యాలయంలోని అన్న విగ్రహానికి మేయర్ సత్య పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన ఆధ్వర్యంలో డీఎంకే సభ్యులు టపాకాయలు పేల్చి మిఠాయిలు పంచుతూ వేడుకల్లో పాల్గొన్నారు. విమానాశ్రయం కోసం కృషిచేసిన మాజీ ముఖ్యమంత్రి ముత్తమిళ్ అరియార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. హోస్టియా అసోసియేషన్ తరపున దీనిని చాలా సంతోషంగా స్వాగతిస్తున్నామని తెలిపారు.

మాదక ద్రవ్యాలపై అవగాహన ర్యాలీ

హోసూరు జూన్ 27: కల్తీ మద్యం, డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై ప్రోహిబిషన్ అండ్ నార్కోటిక్స్ విభాగం ఆధ్వర్యంలో హోసూరులో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. పాఠశాలలు, కళాశాలలకు చెందిన సుమారు 100 మంది విద్యార్థులు, పోలీసులు ఇందులో పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. హోసూరులో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ర్యాలీ చేశారు. ఆర్వీ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణ నుంచి ప్రారంభమైన అవగాహన ర్యాలీని హోసూరు డీఎస్పీ బాబుప్రసాంత్ జెండా ఊపి ప్రారంభించారు. హోసూరు నగరంలోని ప్రధాన రహదారి గుండా ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. పోలీసు కానస్టేబుళ్లు , పాఠశాలలు, కళాశాలలకు చెందిన 100 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. అవగాహన కల్పించి శరీరానికి హాని కలిగించే మత్తు పదార్థాలను వినియోగించవద్దని విక్రయించవద్దని ప్రతిజ్ఞ చేయించారు.



మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

బడిబయట పిల్లలపై నివేదికలో తప్పులుంటే చర్యలు



అధికారులతో సమావేశమైన బాలల పరిరక్షణ కమిషన్ సభ్యుడు వెంకటేశ్

రాయచూరు, జూన్ 27: జిల్లాలో బడి బయట ఉన్న పిల్లలను గురించిన లెక్కలు తప్పుగా ఉంటే పాఠశాల విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్‌పై చర్యలకు ప్రభుత్వానికి సిఫార్సుచేస్తామని రాష్ట్ర బాలలపరిరక్షణకమిషన్ సభ్యుడు వెంకటేశ్ హెచ్చరించారు. గురువారం జిల్లాధికారి కార్యాలయంలో బాల్య వివాహాల నిషేధ చట్టం, జువైనల్ జస్టిస్ చట్టంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన వెంకటేశ్, రాష్ట్రంలో బాలల సంరక్షణ చట్టాన్ని రూపొందించామన్నారు. 11 విభాగాలతో దాడులు నిర్వహించేందుకు అనుమతులిచ్చామని, అయితే ఏ శాఖ అధికారులు కూడా బాధ్యతగా వ్యవహరించడం లేదన్నారు. పోలీస్ శాఖ సహకారంతో ప్రతి చిన్నారి రక్షణకు సంబంధిత శాఖ అధికారులు ముందుకు రావాలన్నారు. సమావేశంలో విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ మాట్లాడుతూ మొత్తం జిల్లాలో 106 మంది పిల్లలు మాత్రమే బడి బయట ఉన్నారని తెలిపారు. రీ సర్వేలో అదనపు పిల్లలు బడి బయట ఉన్నట్లు తేలితే చర్యలు తీసుకుంటామని వెంకటేశ్ హెచ్చరించారు.

లారీ, టిప్పర్ ఢీ.. డ్రైవర్‌కు తీవ్ర గాయాలు




ఎదురెదురుగా వస్తూ ఢీకొన లారీ, టిప్పర్

రాయచూరు, జూన్ 27: నగర శివారుల్లోని పవర్ గ్రిడ్ సమీపంలో గురువారం ఎదురెదురుగా వస్తున్న లారీ, టిప్పర్‌లు ఢీకొన్న ప్రమాదంలో లారీ డ్రైవర్ కాలు విరిగింది. అతడిని రాజావలి సాబ్‌గా గుర్తించారు. ఇసుక తీసుకెళుతున్న టిప్పర్ అదుపుతప్పడంతో ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టింది. దీంతో లారీ డ్రైవర్ కాలు విరిగింది. క్షతగాత్రుడిని రిమ్స్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్సనందిస్తున్నారు. సంఘటన స్థళం నుంచి టిప్పర్ డ్రైవర్ పరారయ్యాడు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్...

పీవీ నరసింహారావు (జయంతి)



ప్రధానమంత్రి పదవిని అధిష్ఠించిన తొలి దక్షిణాది వ్యక్తి, తెలుగువాడు, పాములపర్తి వేంకట (పీవీ) నరసింహారావు 1921 జూన్ 28న వరంగల్ జిల్లా నర్సంపేట మండలం లక్నేపల్లిలో జన్మించారు. పీవీగా పేరొందిన ఆయన బహుభాషావేత్త, రచయితగా కూడా రాణించడం విశేషం. కాంగ్రెస్ పార్టీ ద్వారా ఎన్నో హోదాలలో కొనసాగారు. దేశ ఆర్థిక వ్యవస్థలో సంస్కరణలు తెచ్చారు. 1971-73ల మధ్య ఏపీ నాల్గో ముఖ్యమంత్రిగా, 1991-96ల మధ్య 9వ ప్రధానమంత్రిగా కొనసాగారు. మైనారిటీ ప్రభుత్వానికి నేతృత్వం వహించి అపర చాణుక్యుడిగా పేరొందారు. కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత. 2004 డిసెంబరు 23న కన్నుమూశారు.

ముళ్ళపూడి వెంకటరమణ (జయంతి)



ముళ్ళపూడి వెంకటరమణ 1931 జూన్ 28న తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరంలో జన్మించారు. తెలుగు నవలలు, కథలు, సినిమా కథలు, హాస్యకథలు రాశారు. ప్రత్యేకించి హాస్యరచయితగా పేరొందారు. ఆయన రచనలకు ప్రముఖ చిత్రకారుడు బాపు తనదైన శైలిలో చిత్రాలు అందించారు. దీంతో ఎబాపు-రమణ్ ద్వయంగా పేరొందారు. ప్రత్యేకించి ఆయన రాసిన ఎబుడుగో బాలసాహిత్యంలో పేరు గడించింది. రాజాలక్ష్మీ సాహిత్య పురస్కారం అందుకున్నారు. ఆయన ఆత్మకథ 'కోతి కొమ్మచ్చి' అనే పుస్తకరూపంలో వెలువడింది. 2011 ఫిబ్రవరి 24న కన్నుమూశారు.

ముహమ్మద్ యూనస్ (పుట్టినరోజు)



బంగ్లాదేశ్ నుంచి తొలి నోబెల్ పురస్కారం అందుకున్న ముహమ్మద్ యూనస్ 1940 జూన్ 28న జన్మించారు. సంఘ సంస్కర్తగాను, బ్యాంకర్‌గాను, ఆర్థికవేత్తగా రాణించడమే గ్రామీణబ్యాంక్ స్థాపించి ఈ రంగంలో ఆయన ప్రవేశపెట్టిన విధానాలకు ఎనోబెల్ ప్రైజ్ ఫర్ పీస్ అందుకున్నారు. పలు జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు పొందారు. ఎకనామిక్స్ ప్రొఫెసర్‌గా, చాన్స్‌లర్‌గా సేవలందించారు. ఆర్థిక అంశాలకు సంబంధించి పలు పుస్తకాలు ప్రచురించారు. యునైటెడ్ నేషన్స్ ఫౌండేషన్‌కు సంబంధించి బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్‌లో ఒకరిగా సేవలందించారు.

విశాల్ దాడ్లని (పుట్టినరోజు)



ప్రముఖ గాయకుడు విశాల్ దాడ్లని 1973 జూన్ 28న బాంబేలో జన్మించారు. గాయకుడిగానే కాక గేయ రచయిత, సంగీత స్వరకర్తగా రాణించారు. బాలీవుడ్‌లో విశాల్ - శేఖర్ రావ్ జియాని ద్వయం ఎంతో పేరొందింది. ఝుంకార్ బీట్స్, బ్లఫ్ మాస్టర్, సలాం నమస్తే వంటి సినిమాలు ఆయనకు గుర్తింపు ఇచ్చాయి. 60కుపైగా సినిమాలకు సంగీతం అందించగా 300కుపైగా పాటలు విడుదల చేశారు. ప్రపంచవ్యాప్తంగా వెయ్యికిపైగా సంగీత ప్రదర్శనలు ఇచ్చారు. వీరి ద్వయం ఫిల్మ్‌ఫేర్, ఐఐఎఫ్ఏ అవార్డ్స్, మిర్చి మ్యూజిక్ అవార్డ్స్ తదితర పురస్కారాలు అందుకున్నారు. బుల్లితెరపై సరిగమప వంటి కార్యక్రమాలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించారు.

విద్యుత్ తీగ తగిలి ఇద్దరు ఆటో డ్రైవర్ల మృతి

బెంగళూరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): భారీగా కురుస్తున్న వర్షాల ప్రభావానికి గోడ కూలి ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందిన ఘటన మరువకముందే మరో ఇద్దరు ఆటో డ్రైవర్‌లు గురువారం దుర్మరణం చెందారు. వర్షం ధాటికి మంగళూరులోని పాండేశ్వరలో విద్యుత్‌తీగలు తెగి ఆటో డ్రైవర్ దేవరాజ్‌గౌడపై పడ్డాయి. అతడిని రక్షించేందుకు వచ్చిన మరో ఆటో డ్రైవర్ పుత్తూరు రాజు కూడా షాక్‌కు గురై మృతి చెందారు. ఆటో డ్రైవర్‌లు ఇద్దరూ వాహనాలను శుభ్రం చేసుకుంటుండగా విద్యుత్ తీగలు తెగిపడి ప్రమాదానికి కారణమయ్యాయి. పాండేశ్వర పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

7 నుంచి గూగూడు కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాలు

నార్పల, జూన్ 27: అనంతపురం జిల్లాల్లో ప్రసిద్ధి చెందిన గూగూడు కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాలు జూలై 7వ తేదీ నుంచి ప్రారంభం అవుతాయని ఆలయ ఈఓ సాకేతపురం శోభ గురువారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. జూలై 19వ తేదీన కుళ్లాయి స్వామి చివరి దర్శనంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయన్నారు. 7న కుళ్లాయిస్వామి ప్రథమ దర్శనం, 8న స్వామివారి నిత్యపూజ నివేదన ఉంటాయన్నారు. 9న అగ్నిగుండం ఏర్పాటు, 10న స్వామివారిని నిలుపుట, 11న స్వామివారి నిత్యపూజ నివేదన, 12న స్వామి వారి ఐదవ సరిగెత్తు నిర్వహించడం జరుగుతుందన్నారు. 13న నిత్యపూజ నివేదన, 14న స్వామివారి ఏడవ సరిగెత్తు, 15న స్వామివారి నిత్యపూజ నివేదన ఉంటాయన్నారు. 16న స్వామివారి గ్రామోత్సవం, రాత్రి స్వామి వారి అగ్నిగుండ ప్రవేశం, 17న 4 గంటలకు అగ్నిగుండ ప్రవేశం, జలధికి పోయే కార్యక్రమాలు ఉంటాయన్నారు.



శిడ్లఘట్టలో సాధకులకు సన్మానం



చింతామణిలో కళాబృందాల సందడి



కూడలిలో కెంపేగౌడ ఊరేగింపులో ఉత్సాహం

ఘనంగా కెంపేగౌడ జయంతి

శిడ్లఘట్ట, జూన్ 27: దార్శనికుడైన నాడప్రభు కెంపేగౌడ సేవలు చిరస్మరణీయమని శిడ్లఘట్ట ఎమ్మెల్యే బీఎన్ రవికుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని తాలూకా కార్యాలయంలో కెంపేగౌడ జయంతి సందర్భంగా కెంపేగౌడ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. దేవాలయం వద్ద మొక్కలు నాటారు. ఐఆర్ఎస్ పరీక్షలో ఉత్తీర్ణులైన హంసశ్రీ, ఐఐటీకి ఎంపికైన కిషన్, టెన్నిస్‌లో దక్షిణ ఆసియా చాంపియన్‌షిప్‌కు ఎంపికైన మేలూరు ఎం పునీత్, ఎస్ఎస్ఎల్‌సీ, పీయూసీలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను సత్కరించారు. ఆదర్శరైతులు కాచహళ్ళి రామాంజినప్ప, జయరామరెడ్డి, తిప్పేనహళ్ళి దేవరాజు, మేలూరు ప్రేమా, ప్రవీణ్‌లను సన్మానించారు. తహసీల్దారు బీఎన్ స్వామి, తాలూకా పంచాయతీ ఈఓ నారాయణ్, జిల్లా జాగృతి సమితి సభ్యుడు మేలూరు మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఎస్ఆర్ లే అవుట్‌లో

బొమ్మనహళ్ళి: నాడప్రభు కెంపేగౌడ జయంతిని స్థానిక హెచ్ఎస్ఆర్ లే అవుట్‌లో గురువారం నిర్వహించారు. బొమ్మనహళ్ళి బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు రవీంద్ర నేతృత్వంలో పుష్పాంజలి ఘటించారు. ఒక్కలిగ సంఘం అధ్యక్షుడు రవీంద్ర, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

చింతామణిలో...

చింతామణి:, తాలూకా జాతీయ పండుగల ఆచరణ సమితి ఆధ్వర్యంలో 515వ కెంపేగౌడ జయంతి గురువారం వైభవంగా జరిగింది. కళాబృందాల ఊరేగింపు ప్రజలను ఆకట్టుకుంది. తహసీల్దార్ సుదర్శన్ యాదవ్ ఊరేగింపును ప్రారంభించి మాట్లాడారు. ఎడ్లబండ్లు సహా 25కుపైగా స్తబ్ధచిత్రాలు ఊరేగించారు.

బాగేపల్లిలో...

బాగేపల్లి: బెంగళూరు నగర నిర్మాత కెంపేగౌడ దూరదృష్టి ఆదర్శనీయమని ఎమ్మెల్యే సుబ్బారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో గురువారం కెంపేగౌడ జయంతి సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరతరాలుగా యోగ్యామైన రీతిలో నగరాన్ని నిర్మించారన్నారు. దేవనహళ్ళి అంతర్జాతీయ విమానాశ్రయంలో 108 అడుగుల కెంపేగౌడ విగ్రహం ఏర్పాటుతో మరింత గుర్తింపు వచ్చిందన్నారు. ఇదే సందర్భంగా ఎస్ఎస్ఎల్‌సీ, పీయూసీ, డిగ్రీలలో రాణించిన ఒక్కలిగ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశారు. తహసీల్దార్ ప్రశాంత్ పాటిల్, సీఐ ప్రశాంత్ ఆర్ వర్ధి, రైతుసంఘం తాలూకా అధ్యక్షుడు గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కెంపేగౌడ జయంతిని పురస్కరించుకుని కంఠీరవా స్టేడియం, విధానసౌధ, యలహంకతో పాటు వక్కలిగ సంఘం కార్యాలయాల వద్ద నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, కళాబృందాల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణ అనిపించాయి. డొల్లుకుణిత, వీరగాసెతో పాటు 20కుపైగా కళాబృందాలు పాల్గొన్నాయి. ప్రతిచోటా కెంపేగౌడ వేషధారణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



బాగేపల్లిలో విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానం



కంఠీరవ స్టేడియంలో కెంపేగౌడ జయంతి వేడుకలను ప్రారంభిస్తున్న స్వామీజీలు, సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే తదితరులు



కెంపేగౌడ విగ్రహం వద్ద ఎమ్మెల్యే క్రిష్ణప్ప



బీబీఎంపీ కార్యాలయంలో జయంతి వేడుకలు..



కెంపేగౌడ అవార్డు గ్రహీతలతో సీఎం, డీసీఎం

కెంపేగౌడ జయంతి ఆహ్వాన పత్రికలో దేవెగౌడ, కుమారస్వామి పేర్ల గల్లంతు

- రాద్ధాంతం చేయదలచుకోలేదు: కుమారస్వామి
- ప్రభుత్వ చర్యలపై అభిమానుల ఆగ్రహం

బెంగళూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): నాడప్రభు కెంపేగౌడ జయంతిని ఆడరంబరంగా జరిపిన రాష్ట్ర ప్రభుత్వ చర్యలపై వక్కలిగులలో సర్వత్రా ఆగ్రహం వ్యక్తం అయ్యింది. మాజీ ప్రధానిదేవేగౌడ, కేంద్ర భారీ పరిశ్రమల శాఖా మంత్రి హెచ్‌డి కుమారస్వామిల పేర్లు ఆహ్వానపత్రికలో ముద్రించకపోవడం సర్వత్రా విమర్శలకు కారణమవుతోంది. వక్కలిగ సమాజంలో కీలకమైన ప్రధానమంత్రి పదవిని చేపట్టిన దేవేగౌడ పేరున విస్మరించారు. ప్రస్తుతం కేంద్రకేబినెట్‌లో కీలకమైన మంత్రిగా రాణిస్తున్న కుమారస్వామి పేరును విస్మరించడం కూడా విమర్శలకు కారణమైంది.

రచ్చ చేయదలచుకోలేదు : కుమార

కెంపేగౌడ జయంతిని జరిపిన రాష్ట్ర ప్రభుత్వం మాజీ ప్రధాని దేవేగౌడతో పాటు తన పేరును ఆహ్వానపత్రికలో ముద్రించకపోవడాన్ని తాను రాద్ధాంతం చేయదలచుకోలేదని కుమారస్వామి అభిప్రాయపడ్డారు. గురువారం ఢిల్లీలో కుమారస్వామి మాట్లాడుతూ కెంపేగౌడ దేశానికే గర్వకారణమైన ప్రముఖులన్నారు. ఆహ్వాన పత్రికలో మా పేర్లు లేవనే విషయం తెలిసిందని నేను ఇదే పెద్ద అంశంగా పరిగణించదలచుకోలేదన్నారు. రెండుసార్లు ముఖ్యమంత్రిగా వ్యవహరించానని బెంగళూరు అభివృద్ధికి ఎంతో శ్రమించానన్నారు. కెంపేగౌడకు గౌరవం తెచ్చేలాంటి పనులు చేశానన్నారు. ఇప్పటికిప్పుడు నాపేరు చేర్చినా నేను కార్యక్రమానికి వెళ్ళలేనని రాష్ట్రపతి ద్రౌపదిముర్ము ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగించే కార్యక్రమంలో పాల్గొనాల్సి ఉందన్నారు. ఇక్కడి నుంచే కెంపేగౌడకు గౌరవం సమర్పిస్తానన్నారు. జయంతిని ఇంట్లో ఫోటో పెట్టుకుని పూజించేవారు ఉన్నారన్నారు. కాగా జయంతి ఆహ్వానపత్రికలో దేవేగౌడ, కుమారస్వామిల పేర్లు లేకపోవడంపై కోలారులో నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే కొత్తనూరు మంజునాథ్, ఎమ్మెల్సీ అనిల్‌కుమార్‌ల ముందే జేడీఎస్ కార్యకర్తలు ఆందోళన చేశారు. జేడీఎస్, కాంగ్రెస్ కార్యకర్తల మధ్యన తోపులాటతో పాటు దాడి చేసుకునే పరిస్థితి ఏర్పడింది. సీఎం, డీసీఎంలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసుల జోక్యంతో సద్దుమణిగింది.

మరోసారి పొరపాటు జరుగకుండా చర్యలు : డీకే

కెంపేగౌడ జయంతి నిర్వహించడం ద్వారా ఎవరినీ అవమానించాలని అనుకోలేదని డీసీఎం డీకే శివకుమార్ తెలిపారు. జయంతి ఆహ్వానపత్రికలో మాజీ ప్రధాని దేవెగౌడ, కేంద్రమంత్రి కుమారస్వామిల పేర్లు లేక పోవడంపై వివరణ ఇచ్చారు. బెంగళూరు, బెంగళూరు గ్రామీణ, తుమకూరు ప్రజాప్రతినిధుల పేర్లను మాత్రమే ఆహ్వానపత్రికలో చేర్చారన్నారు. దేవేగౌడ హాసన్ నుంచి కుమారస్వామి మండ్య నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారన్నారు. వచ్చే ఏడాది ఇటువంటి తప్పులు జరుగకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

స్వామీజీ స్థానం వదులుకుంటారా... మంత్రి రాజణ్ణ సవాల్

డీకే శివకుమార్ కోసం ముఖ్యమంత్రి పదవిని వదులుకోవాలని బహిరంగంగా విశ్వవక్కలిగ మహాసంస్థాన మఠాధిపతి చంద్రశేఖరనాథ స్వామీజీ వ్యాఖ్యలపై సహకార శాఖా మంత్రి రాజణ్ణ తీవ్రంగా స్పందించారు. స్వామీజీ మఠాన్ని వదులుకుంటారా అంటూ ప్రశ్నించారు. ఆయన మాత్రం మఠాధిపతిని వదులుకోరు కానీ మరొకరు మాత్రం ముఖ్యమంత్రి పదవిని వదులుకోవాలా అన్నారు. స్వామీజీ పీఠం వదులుకుంటే నేను కాషాయం దుస్తులు వేసుకుని స్వామీజీ అవుతానన్నారు. ఎవరూ హోదాలను వదులుకోరని సలహాలు బాగానే ఉంటాయన్నారు.



కోలారులో ఆందోళన చేస్తున్న జేడీఎస్ కార్యకర్తలు

ఉచిత సంగీత శిక్షణ కేంద్రం ప్రారంభం

బొమ్మనహళ్ళి, జూన్ 27: దివ్యాంగులకు చేయూతనిస్తున్న సమర్థనం ట్రస్టు తాజాగా ఉచిత సంగీత శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. సమర్థనం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మ్యూజిక్ అండ్ పెర్‌ఫార్మింగ్ సెంటర్‌ను ఎమ్మెల్సీలు గోపినాథరెడ్డి, రామోజిగౌడ, సమర్థనం ట్రస్టు చైర్మన్ మహంతేశ్, కర్ణాటక గంగూబాయి హానగల్ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ నాగేశ్ గురువారం లాంఛనంగా ప్రారంభించారు. నాగేశ్ మాట్లాడుతూ 27 సంవత్సరాలుగా దివ్యాంగులకు సేవలందిస్తున్న సమర్థనం సంస్థ తాజాగా మరింత ప్రత్యేక కేంద్రాన్ని ప్రారంభించడం అభినందనీయమని ప్రశంసించారు. మహంతేశ్ మాట్లాడుతూ ప్రస్తుతం 2024-25 వార్షిక తరగతులను ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. కర్ణాటక శాస్త్రీయ సంగీతం, హిందూస్తానీ సంగీతం, భరతనాట్యం, వివిధ వాద్యాలకు సంబంధించి ఉచిత తర్ఫీదు ఇవ్వనున్నట్టు తెలిపారు. ఆరు నెలల సర్టిఫికెట్ కోర్సు, ఒక ఏడాది, డిప్లమో కోర్సు, మూడేళ్ల డిగ్రీ కోర్సులు ఉన్నాయన్నారు. దివ్యాంగులకు ఉచిత భోజనం, వసతి సదుపాయం ఉందన్నారు. మధు తదితరులు పాల్గొన్నారు.



శిక్షణా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీలు గోపినాథరెడ్డి, రామోజిగౌడ

అధ్వానంగా విమానాశ్రయ రోడ్డుమార్గం

- గుంతలతో వాహనదారుల ఇక్కట్లు
- మరమ్మతులపై అధికారుల నిర్లక్ష్యం

బెంగళూరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): దేశంలో అతిపెద్ద మూడో విమానాశ్రయంగా అనతికాలంలోనే ఎదిగింది. అద్భుతం అనిపించేలా రెండో టర్మినల్ ఏర్పాటుతో అంతర్జాతీయ విమానాశ్రయాలలో తలమానికంగా నిలిచింది. ఇలా దశాబ్దన్నర కాలంలోనే బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయం ఎన్నో రికార్డులను తిరగరాసింది. ప్రయాణికుల సంఖ్య లక్షల్లోకి చేరడం, సరుకు రవాణాలోనూ భారీగా ప్రగతి సాధించిన విషయం తెలిసిందే. బెంగళూరు నగరం నుంచి విమానాశ్రయానికి చేరుకునేందుకు ప్యాలెస్ రోడ్డు మీదుగా హెబ్బాళ్ బ్రిడ్జ్ ఎస్టీమ్‌మాల్, యలహంక పై ఓవర్‌ల మీదుగా ప్రధానమార్గం ఉంది. రోజూ ఈ మార్గంలో వేలాదివాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో 24గంటలపాటు ట్రాఫిక్ సమస్య కొనసాగుతోంది. ప్యాలెస్‌రోడ్డుపై ఒత్తిడి తగ్గించేందుకు హెణ్ణూరు - కణ్ణూరు - బాగలూరుల మీదుగా ప్రత్యామ్నాయ మార్గాన్ని నిర్మించారు. ట్యాక్సీలు టోల్ లేకుండా ఈ మార్గం గుండా ప్రయాణించే వెసలుబాటు ఉంది. ఇటీవల కొంతకాలంగా ఈ రోడ్డు పర్యవేక్షణ లేకపోవడంతో అధ్వానంగా మారింది. రోడ్డు పొడవునా భారీ గుంతలు ఏర్పడ్డాయి. ఈ మార్గంలో ప్రయాణించాలంటే వాహనాల మరమ్మత్తులకు గురవుతాయని సమయానికి విమానాశ్రయం చేరుకోలేమని అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రత్యామ్నాయ మార్గం అనే పేరుతో నిర్మాణాలు చేపట్టాక వాటిని పర్యవేక్షించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంది. ఏడేళ్లక్రితం ఈ రోడ్డును నిర్మించారు. తొలి మూడేళ్లు ఈ మార్గంగుండా వాహనాలు ఎక్కువగా సంచరించేవి. ఇటీవల టోల్ భారం ఎక్కువ కావడంతో ఇదో మంచి అవకాశమని ట్యాక్సీ డ్రైవర్‌లు భావించేవారు. అయితే ఏళ్ల తరబడి రోడ్డును పట్టించుకోకుండా వదిలేశారు. రింగ్ రోడ్డు హెణ్ణూరు నుంచి కణ్ణూరు, బాగలూరుల మీదుగా ఎయిర్‌పోర్ట్‌కు చేరుతుంది. 26 కిలోమీటర్ల మేర ఉండే ఈ మార్గంలో ప్రయాణించాలంటే ట్యాక్సీ డ్రైవర్‌లు, వాహనదారులు హడలెత్తిపోతున్నారు. రోడ్డు పొడవునా గుంతలు, మట్టితో నిండిపోయింది. ముందుభాగాన ఓవాహనం వెళ్తే దుమ్ము, ధూళి తీవ్రంగా రేగుతోంది. రోడ్డు పొడవునా చెత్తకుప్పలు, కేబుల్ అమర్చేందుకు తవ్వకాల వంటి పనులే కాకుండా రోడ్డు విస్తరింపచేయకపోవడం ఇబ్బందికరంగా మారింది. ఎటు చూసినా చెట్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి ఉంటారు. రోడ్డు బాలేకపోవడంతో వేగంగా వాహనాలు సంచరించే పరిస్థితి లేదు. ఈ మార్గంలో రాత్రిపూట డ్రైవర్లకు రక్షణ లేదనిపించేలా మారిపోయింది. విమానాశ్రయ ప్రత్యామ్నాయ మార్గాన్ని ప్రజాపనులశాఖ నిర్మించి పర్యవేక్షిస్తోంది. కొవిడ్ తర్వాత శాఖాపరంగా ఎటువంటి చర్యలు కొనసాగే లేదు. చిన్నపాటి గుంతలను ఎప్పటికప్పుడు మరమ్మత్తులు చేసి ఉంటే సమస్య పరిష్కారమయ్యేది. బెంగళూరు గ్రామీణ, చిక్కబళ్ళాపుర జిల్లా చెరువులకు నీటిని మళ్లించే కాలువలు ఈ మార్గంలోనే తవ్వారు. పైప్‌లైన్‌ల కోసం తవ్వకాలను సమగ్రంగా పనులు పూర్తి చేయలేదు. రింగ్‌రోడ్డు హెణ్ణూరు జంక్షన్, గద్దలహళ్ళి రైల్వే అండర్‌పాస్, కొత్తనూరు - కే నారాయణపుర కూడు రోడ్డు, కణ్ణూరు గ్రామం జంక్షన్, మిట్టగానహళ్ళిగేట్ జంక్షన్, బాగలూరు జంక్షన్, బండి కొడిగేహళ్ళి గ్రామం, మైలనహళ్ళి, దాలమ్మసర్కిల్ ప్రాంతాల్లో రోడ్డు దుస్థితి తీవ్రంగా ఉంది. ఎయిర్‌పోర్ట్‌కు అత్యంత సమీపంలో ఉండే బేగూరు, చిక్కనహళ్ళి, మైలనహళ్ళి వద్ద రోడ్డుకు ఇరువైపులా వందలాది ట్యాక్సీలు పార్కింగ్ చేయడం ద్వారా సమస్య తీవ్రమవుతోంది. దాలమ్మ సర్కిల్ వద్ద సిగ్నల్ ఉన్నా నిబంధనలు పాటించడం లేదు. వర్షం వస్తే సకాలంలో ఎయిర్‌పోర్ట్‌కు ఈ మార్గంలో చేరుకునే పరిస్థితి లేదు. బాగలూరు మీదుగా ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉన్నా పట్టించుకోవడం లేదని ఈ ప్రాంత ప్రజలు, ట్యాక్సీ డ్రైవర్‌లు మండిపడుతున్నారు. సర్వజ్ఞనగర్, మహదేవపుర, బ్యాటరాయనపుర శాసనసభ నియోజకవర్గాలు ఈ మార్గానికి అనుబంధంగా ఉన్నాయి. ఇక్కడి ఎమ్మెల్యేలుగా వ్యవహరించే కృష్ణబైరేగౌడ, కేజే జార్జ్‌లు మంత్రులుగా ఉన్నప్పటికీ స్పందించలేదనే విమర్శలు ఉన్నాయి.



కంకర తేలిన హెణ్ణూరు బాగలూరు రోడ్డు